వారి భవిష్యత్తు అంధకారమే(నా)?!

- కూరలో కరివేపాకులా మారిన ఫిరాయింపు కౌన్సిలర్లు
- ఆయా వార్డుల్లో టీడీపీ నేతలకే పెత్తనం
- మున్సిపాలిటీ నిధుల్లో ప్రాధాన్యతా డౌటే



హిందూపురం మున్సిపాలిటీ కార్యాలయం

చిలమత్తూరు: హిందూపురం మున్సిపల్ చైర్మన్‌ను దక్కించుకునేందుకు అడ్డదారులు తొక్కిన టీడీపీ అనుకున్నది సాధించుకుంది. ఇందులో తమకు పావుగా మారిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను పక్కన పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. టీడీపీకి ఆరుగురు మాత్రమే కౌన్సిలర్లు ఉన్నా వైఎస్సార్‌సీపీకి చెందిన 12 మంది కౌన్సిలర్లకు తాయిలాల ఎర చూపి చైర్మన్ స్థానాన్ని దక్కించుకుంది. అయితే పార్టీ ఫిరాయించి, విప్ ఉల్లంఘించిన కౌన్సిలర్ల విషయంలో టీడీపీ ఆలోచన వేరేవిధంగా ఉన్నట్లు చర్చ సాగుతోంది. వారిని పూర్తిగా పక్కనపెట్టి తమ పార్టీ నేతలకు ప్రాధాన్యత కల్పించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. మరోవైపు ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీకి మద్దతు ఇచ్చిన వీరిని ప్రజలు ఛీత్కరించుకుంటున్నారు.

ఫిరాయింపు కౌన్సిలర్లకు మొండిచేయి

కుట్రలు, ఆపై క్యాంపు రాజకీయాలు చేసి ఎలాగోలా చైర్మన్ పీఠాన్ని దక్కించుకున్న టీడీపీ ఫిరాయింపు కౌన్సిలర్లను కూరలో కరివేపాకులా తీసేయాలని చూస్తున్నట్లు పురంలో చర్చ సాగుతోంది. తల్లిపాలు తాగి రొమ్ము గుద్దిన ఇలాంటి కౌన్సిలర్లు రేపొద్దున తమను మోసం చేయరన్న గ్యారెంటీ ఏమిటి అనే కోణంలో ఎమ్మెల్యే బాలకృష్ణ ఆలోచిస్తున్నట్టుగా తెలుస్తోంది. ఇదే క్రమంలో ఫిరాయింపు కౌన్సిలర్లు ఉన్న వార్డుల్లో తమ పార్టీ కేడర్‌లో ముఖ్యులకు పెత్తనం ఇవ్వాలనుకుంటున్నట్లు సమాచారం. త్వరలో మున్సిపాలిటీకి భారీగా నిధులు రానుండగా, తమ పార్టీ నేతలకు పగ్గాలిచ్చి ఆయా వార్డుల కౌన్సిలర్లకు మొండి చెయ్యి చూపించనున్నారు. ఆయా వార్డుల్లో టీడీపీ నేతలకు తప్ప పార్టీ పిరాయించిన వారికి ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వకూడదన్న ఆదేశాలు ఇచ్చారన్న చర్చ జోరుగా సాగుతోంది. వార్డు అభివృద్ధి ఉండక, నిధులు రాక ఏమిటీ తమ పరిస్థితి అనే ఆందోళన సదరు కౌన్సిలర్ల మదిలో ఉన్నట్టుగా తెలుస్తోంది. దీంతో పార్టీ మారి భవిష్యత్ ఉంటుందనుకున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

పార్టీ మారితే భవిష్యత్ ఉండదు



హిందూపురంలో ఆరుగురు కౌన్సిలర్లు మాత్రమే ఉన్న టీడీపీ అడ్డదారుల్లో మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని దక్కించుకోవడం పట్ల ప్రజలు ఆ పార్టీ తీరును చీదరించుకుంటున్నారు. కంచుకోట అని చెప్పుకొనే ఎమ్మెల్యే బాలకృష్ణ ఇలా దొడ్డిదారిన వెళ్లి చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవడం సిగ్గుచేటు. అలాంటి వ్యక్తి ఎమ్మెల్యే కావడం పురం ప్రజల దురదృష్టం. పార్టీ మారిన కౌన్సిలర్లకు ఎప్పటికీ భవిష్యత్ ఉండదు. వారి పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. కేవలం తాయిలాల కోసం వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. అలాంటి గెలుపు ద్వారా ఏదీ సాధించలేరనే విషయాన్ని బాలకృష్ణ గుర్తించాలి. మున్సిపాలిటీలో ఎలాంటి అవినీతి అక్రమాలు జరిగినా సహించేది లేదు.

– టీఎస్ దీపిక , వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, హిందూపురం

క్లుప్తంగా

శివరాత్రి ఉత్సవాల నిర్వహణకు విరాళం


చైర్మన్‌కు చెక్కు అందిస్తున్న కమిటీ సభ్యులు

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి ఆలయంలో ఈనెల 25 నుంచి మార్చి 1 వరకు జరిగే మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణకు స్థానిక అన్నదాన సేవా ట్రస్ట్ సభ్యులు ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్‌కు శనివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఈనెల 28వ తేది రాత్రి జరిగే ముత్యాల పల్లకీ సందర్భంగా కీలుగుర్రాల ప్రదర్శన కోసం వెచ్చించాలని ఆయనకు సూచించారు. అన్నదాన కమిటీ సభ్యులకు ఆలయ కమిటీ చైర్మన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మార్చి 8న జాతీయ లోక్‌అదాలత్

మడకశిర: మార్చి 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి అశోక్‌కుమార్ సూచించారు. శనివారం కోర్టు హాల్‌లో నియోజకవర్గంలోని పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. పోలీసులు లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులను పరిష్కరించడానికి కృషి చేయాలని కోరారు. అన్ని మండలాల్లో కూడా ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీఐ రాజ్‌కుమార్, 5 మండలాల ఎస్‌ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

అండర్-13 బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ


విద్యార్థినులను అభినందిస్తున్న పాఠశాల బృందం

హిందూపురం టౌన్: ఆర్టీటీలో ఈ నెల 10న జరిగిన ఖేలో ఇండియా అస్మిత్ అండర్-13 బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో ఎల్‌ఆర్‌జీ విద్యాలయానికి చెందిన విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. బాలికల జట్టులో ఏడుగురు ఎల్‌ఆర్‌జీ విద్యార్థినులు పాల్గొని ఉత్తమంగా రాణించారు. జట్టు విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించడంతో వారిని శనివారం పాఠశాలలో ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి సలీమ్, పాఠశాల మేనేజ్‌మెంట్ సెక్రటరీ బాలసుందరం, హెచ్‌ఎం ప్రసాద్, ఏఓ సంజీవ, పీడీలు విజయభాస్కర్ రెడ్డి, హరీష్, హరీష్ కుమార్ అభినందించారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండండి


బీదానిపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నరేంద్ర

రొద్దం: ప్రతిఒక్కరూ అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ నరేంద్ర సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి మండలంలోని బీదానిపల్లిలో పల్లె నిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామస్తులు ప్రశాంతగా జీవించాలన్నారు.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నియంత్రణ, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, మత్తు పదార్థాల వల్ల అనర్థాలు, సైబర్ మోసాల గురించి అవగాహన కల్పించారు. డిజిటల్ అరెస్టులు, లోన్ యాప్ ఫ్రాడ్స్ తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు


నవధాన్యాల విత్తనాలను నాటుతున్న దృశ్యం

మడకశిరరూరల్: మండలంలోని ఆర్.అనంతపురం, బుళ్లసముద్రం, మణూరు గ్రామాల్లో శనివారం రైతులు గంగరత్నమ్మ, అశ్విని, దాసప్పలకు చెందిన బీడు భూముల్లో నవధాన్యాల విత్తనాలు సాగు చేసినట్లు డివిజన్ ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జ్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అలసంద, సజ్జ, అనుములు, ఆముదంతో పాటు 24 రకాల పంటలు సాగు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. నవధాన్యాల సాగుతో భూమి సారవంతమై ఖరీఫ్‌లో మంచి దిగుబడి పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటల సాగు లాభాదాయకంగా ఉంటుందన్నారు.

అతివేగం, నిర్లక్ష్యంతోనే రోడ్డు ప్రమాదాలు


రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐలు

హిందూపురం అర్బన్: అతివేగం, నిర్లక్ష్యంతోనే అధిక శాతం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఎంవీఐలు జయశ్రీ యాదవ్, ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని కిరికెర ఎల్‌ఆర్‌జీ స్కూల్‌లో శనివారం రోడ్డు భద్రతా మాసోత్సవ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. విద్యార్థులు స్కూల్ బస్సు దిగిన తరువాత బస్సు ముందు వైపు ఎట్టి పరిస్థితులలోనూ వెళ్లొద్దన్నారు. బస్సు ఆపి అటెండర్ దిగమన్నప్పుడే బస్సు దిగాలన్నారు. బస్సుల్లో సైతం పరిమితికి మించి విద్యార్థులను తరలించరాదన్నారు. ఉపాధ్యాయులు సైతం విద్యార్థుల నడవడికలు గమనిస్తూ తగిన సూచనలు చేయాలన్నారు.

సేంద్రియ వ్యవసాయం లాభదాయకం


ఆమిదాలగొందిలో సూర్య మండల మోడల్ సాగుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలను సాగు చేసి ఆదాయం పొందాలని రైతు సాధికార సంస్థ కమ్యూనికేషన్ టీమ్ సభ్యురాలు కీర్తన సూచించారు. శనివారం ఆమిదాలగొంది గ్రామంలోని ఓ రైతు పొలంలో సూర్య మండల మోడల్ ఆకారం ఏర్పాటు చేశారు. బహుళ పంటల, బహుళ-స్థాయి సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూసారాన్ని మెరుగుపరచడంతో పాటు నీటి వినియోగాన్ని తగ్గిస్తుందన్నారు. తక్కువ ఖర్చుతో రైతు లాభాలు పొందవచ్చన్నారు. కృత్రిమ పురుగులు అవసరం లేకుండా సహజ పద్ధతుల్లో పంటలు సాగు చేయడం ద్వారా స్వయం సమృద్ధి సాధించి ఆరోగ్యకరమైన ఆహారం పొందవచ్చని పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా పోషక తోటల పెంపకాన్ని మరింతగా ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఎంఎంటీఎల్ రమేష్, యూనిట్ ఇన్‌చార్జ్ మంజునాథ్, హెల్త్ న్యూట్రిషన్ సభ్యులు జ్యోతి పాల్గొన్నారు.

సమన్వయంతో కేసులు పరిష్కరిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

హిందూపురం అర్బన్: న్యాయాధికారులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు సమన్వయంతో కేసులు పరిష్కరిద్దామని అదనపు జిల్లా న్యాయమూర్తి కంపల్లె శైలజ సూచించారు. శనివారం స్థానిక అదనపు జిల్లా కోర్టు ఆవరణలో జాతీయమెగా లోక్ అదాలత్‌పై సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మీ హరిక, ప్రత్యేక న్యాయమూర్తులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే పోలీస్ స్టేషన్‌ల వారీ లక్ష్యాలను నిర్దేశించామన్నారు. రాజీ అయ్యేందుకు అవకాశం ఉన్న ప్రతి కేసును పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. పోలీసులు, న్యాయవాదుల పరిధిలో పరిష్కారం కాని పక్షంలో తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ముందస్తు లోక్ అదాలత్ నిర్వహించి కక్షదారులతో నేరుగా చర్చించి నిబంధనలకు లోబడి కేసులు పరిష్కరించనున్నట్లు ఆమె తెలిపారు. సివిల్, చెక్‌బౌన్స్, బ్యాంకుల పరిధిలో ఉన్న కేసులు, మున్సిపాలిటీ, ప్రమాదబీమా, రాజీ అయ్యేందుకు అవకాశం ఉన్న క్రిమినల్ కేసులను సైతం పరిష్కరిస్తామన్నారు. సీఐలు రాజగోపాల్ నాయుడు, ఆంజనేయులు, జనార్ద‌న్‌తో పాటు న్యాయవాదులు శ్రీనివాసరెడ్డి, సిద్ధూ, నాగేంద్ర, చిలమత్తూరు, లేపాక్షి, పరిగి మండలాల ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఘనంగా ‘స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్’


హిందూపురంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ ప్రగతి


పరిగి పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న పోలీసులు

సాక్షి నెట్‌వర్క్: హిందూపురం,మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతపై ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాల్లో చెత్తాచెదారంతోపాటు పిచ్చి మొక్కలు తొలగించారు. పారిశుధ్యంపై విద్యార్థులతో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

46 జాతులకు సౌకర్యాలు కల్పించాలి


నూతన పదాధికారులను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకా వ్యాప్తంగా అలెమారి అరె అలెమారి (కొండ జాతులు) బీసీ ఎం-1 వర్గాలకు చెందిన 46 జాతులకు మండలి నుంచి సౌకర్యాలు కల్పించేలా కృషి చేయాలని జిల్లా కూటమి కార్యదర్శి మూడ్లగిరీశ్ నూతన కూటమి పదాధికారులకు సూచించారు. శనివారం స్థానిక అతిథి గృహంలో సమితి పదాధికారుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. తాలూకా సమితి అధ్యక్షుడిగా యాదవ సంఘం నాయకుడు ఎస్.మైలారరెడ్డి, గౌరవాధ్యక్షుడిగా జి.బలరామరెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మైలారరెడ్డి మాట్లాడుతూ.. అలెమారి అరె అలెమారి సంఘంలో 46 జాతులు ఉన్నాయన్నారు. పావగడ తాలూకాలో 4 నుంచి 5 జాతులు ఉన్నట్లు తెలిపారు. అన్ని జాతులకు ఈ కూటమిలో అవకాశం ఉందని వెల్లడించారు. మండలి నుంచి వచ్చే సౌలభ్యాలు అన్ని జాతులకు వర్తింపజేయాలని కోరారు. గౌరవాధ్యక్షుడు బలరామరెడ్డి మాట్లాడుతూ.. గొల్లరహట్టిలో సీసీ రోడ్లు, వసతి, సముదాయ భవనాలు, గంగాకళ్యాణి తదితర సౌకర్యాల కోసం అన్ని జాతుల వారు సమష్టిగా కృషి చేయాలన్నారు.

ప్రజల మద్దతు వైఎస్సార్‌సీపీకే

- పార్టీ ద్రోహులకు ప్రజలు తగిన గుణపాఠం చెప్తారు
- వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యం
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప


ఈరలక్కప్ప

మడకశిర: నియోజకవర్గంలోని పార్టీ ద్రోహులకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప శనివారం ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకుల ట్రాప్‌లో పడి కొంత మంది వైఎస్సార్‌సీపీ నాయకులు పార్టీని వీడినా ఎలాంటి నష్టం లేదన్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పదవులు పొంది ఈరోజు పార్టీకి ద్రోహం చేసి టీడీపీలో చేరడం సరికాదన్నారు. వైఎస్ జగన్ ఇచ్చిన పదవులకు రాజీనామా చేయకుండా పార్టీని మాత్రమే వీడటం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. నియోజకవర్గంలో టీడీపీ బలంగా లేకపోవడంతోనే టీడీపీ నాయకులు రకరకాలుగా వైఎస్సార్‌సీపీ నాయకులను మభ్యపెట్టి పార్టీలో చేర్పించుకుంటున్నారని విమర్శించారు. టీడీపీ నాయకులు విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ చాలా బలంగా ఉందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఏమాత్రం అధైర్యపడవద్దని పేర్కొన్నారు. పార్టీ కోసం ధైర్యంగా పని చేయాలని సూచించారు. టీడీపీని గెలిపించిన ప్రజలు ప్రస్తుతం బాధ పడుతున్నారని గుర్తు చేశారు. వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమని తెలిపారు.

సంక్షిప్త సమాచారం

నేడు యువకుల ఆత్మీయ పలకరింపు

పెనుకొండ రూరల్: గోరంట్ల మండల వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్న యువకులతో ఆదివారం ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని సాయిబాబా దేవాలయం సమీపంలోని పోతుల రామకృష్ణారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేశామని ఆ పార్టీ నాయకులు శనివారం తెలిపారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ భర్త చరణ్ రెడ్డి హాజరవుతారన్నారు. యువత హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

రేపు పులమతిలో చింత ఫలసాయం వేలం

లేపాక్షి: పులమతి పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు చింత ఫలసాయం వేలం నిర్వహించనున్నట్లు సర్పంచ్ అశ్వత్థనారాయణ, కార్యాదర్శి దుర్గయ్య శనివారం తెలిపారు. ధరావత్తు చెల్లించిన వారు మాత్రమే వేలంలో పాల్గొనాలని సూచించారు. వేలంలో పాల్గొనే వారు నిర్ణీత రుసుం చెల్లించాలని పేర్కొన్నారు.

విద్యాభివృద్ధికి చర్యలు తీసుకోండి

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని అలుపనపల్లి, రొళ్ల, ఎం.రాయాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆయా కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అలుపనపల్లిలో జరిగిన కాంప్లెక్స్ సమావేశాల్లో ఎంఈఓ శ్రీధర్ మాట్లాడారు. చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి ఏ గ్రేడ్ స్థాయికి తీసుకురావాలన్నారు. ఆంగ్ల భాషలో విద్యార్థులు పట్టు సాధించేలా చొరవ తీసుకోవాలని సూచించారు. అనంతరం రంగనపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలల్లో రికార్డులు తనిఖీ చేశారు. పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు.

పీడీఓపై సస్పెన్షన్ వేటు

పావగడ: అవినీతి అక్రమాల ఆరోపణలతో తాలూకాలోని గుజ్జనడు, కన్మేడి గ్రామ పంచాయతీల పీడీఓ రాఘవేంద్ర సస్పెన్షన్‌కు గురయ్యారు. రెండు గ్రామ పంచాయతీల్లో నిధుల దుర్వినియోగం, కర్తవ్య లోపం , నియంతృత్వ ధోరణి, పంచాయతీ సభ్యులపై రాఘవేంద్ర దౌర్జన్యంగా వ్యవహరించారు. గుజ్జనడు గ్రామానికి చెందిన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి టీహెచ్ఓ డా.కిరణ్‌ను మొబైల్‌లో బెదిరించినట్లు ఈఓ జానకీరాం నివేదికను రూపొందించారు. ఇతని వ్యవహారాలపై సమగ్ర నివేదికను తుమకూరు జిల్లా సీఈఓ జి.ప్రభుకు అందించారు. నివేదికను పరిశీలించిన సీఈఓ ప్రభు.. పీడీఓ రాఘవేంద్రపై సస్పెన్షన్ వేటు వేశారు.

18న వాహనాల వేలం

హిందూపురం అర్బన్: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 18న వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ రామ్మోహన్ శనివారం తెలిపారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం



మడకశిర: పట్టణంలో శనివారం మిట్టబండ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. వందలాది మంది మహిళలు జ్యోతులతో పట్టణంలో ఊరేగింపు చేపట్టారు. అనంతరం ఆలయం వద్దకు చేరుకుని ఆంజనేయస్వామికి జ్యోతులు సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం అందజేశారు.

గుండెపోటుతో సీనియర్ అసిస్టెంట్ మృతి


జయనాయక్

లేపాక్షి/సోమందేపల్లి: లేపాక్షి మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జయనాయక్ (50) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వగ్రామం గోరంట్ల మండలం కరావులపల్లి తండా. ఇంట్లో తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు పుట్టపర్తికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గతంలో ఆయన గోరంట్లలో విధులు నిర్వహించారు. జయనాయక్ మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

మడకశిరలో మెగా జాబ్‌మేళా

మడకశిర: పట్టణంలోని మధుగిరి రోడ్డులో శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ఆవరణలో మెగా జాబ్ మేళా జరిగింది. ఈ జాబ్ మేళాలో 50 వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని దాదాపు 1300 మంది నిరుద్యోగ యువతీ యువకులు ఈ జాబ్‌మేళాకు హాజరయ్యారు. వివిధ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 300 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

పరిగి: మండలంలో శనివారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రంగడుయాదవ్ తెలిపారు. పెన్నా, జయమంగళి నదుల్లో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. ఈక్రమంలో పెన్నా నదిలో రెండు, జయమంగళి నదిలో ఒక ట్రాక్టరు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. మూడు ట్రాక్టర్లనూ సీజ్ చేసి కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

చింత వనానికి నిప్పు

అగళి: కోడిపల్లి గ్రామంలో చింత వనానికి శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దాదాపు 20 చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. అధికారులు చింత వనాన్ని పరిశీలించి, న్యాయం చేయాలని రైతు శ్రీనివాస్ కోరాడు.

నేడు ఉచిత వైద్య శిబిరం

అమరాపురం: స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయ ఆవరణలో ఆదివారం ఉదయం పది గంటలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు పార్వతమ్మ, విద్యాసాగర్, వినిత్ కుమార్, సవిత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శాంతిరామ్ కంటి ఆసుపత్రి నంద్యాల వారి ఆధ్వర్యంలో జరిగే వైద్య శిబిరంలో అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో విధులు నిర్వర్తిస్తున్న చిన్న పిల్లల వైద్యుడు దినకర్ పాల్గొంటారన్నారు. చిన్న పిల్లలు, పురిటి పిల్లలు, గుండె సమస్యలు, కంటి సమస్యలు ఉన్న వారికి ఉచితంగా వైద్య పరీక్షలు, ఆపరేషన్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని రోగులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైద్య ఉద్యోగి ఇంట్లో చోరీ

పెనుకొండ: పట్టణంలోని బ్రిలియన్స్ స్కూల్ సమీపంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పని చేసే తిప్పక్క అనే మహిళ ఇంట్లో చోరీ జరిగింది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మావటూరుకు చెందిన తిప్పక్క స్థానిక ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో దినసరి వేతనం కింద పని చేస్తోంది. గురువారం రాత్రి ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఆమె ఇంట్లో రూ. 30 వేల నగదు, రెండు జతల కమ్మలను ఎత్తుకెళ్లారు. చోరీపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు.

కుంభమేళాకు ఆర్టీసీ సర్వీసు ప్రారంభం

హిందూపురం టౌన్: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేకంగా కుంభమేళా(ప్రయాగరాజ్)కు సూపర్ లగ్జరీ బస్సును శనివారం అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం రామసుబ్బయ్య మాట్లాడుతూ ఫిబ్రవరి 25న మహాకుంభమేళాకు ప్రత్యేక సర్వీసు నడుపుతున్నామన్నారు. రిజర్వేషన్ కోసం 9440834715, 7382861542 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వీగిన అవిశ్వాస తీర్మానం


సమావేశమైన పంచాయతీ సభ్యులు, ఏసీ గోటూరు శివప్ప

పావగడ: తాలూకాలోని కొడమడుగు గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు అడివక్కపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగి పోయింది. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏసీ గోటూరు శివప్ప ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మానంపై సభ నిర్వహించారు. గ్రామ పంచాయతీలో మొత్తం 15 మంది సభ్యులు ఉండగా.. ఏడుగురు సభ్యులు మాత్రమే హాజరయ్యారు. అధ్యక్షురాలు అడివక్కతో పాటు ఆమె మద్దతుదారులు 8 మంది సభ్యులు సభకు గైర్హాజరయ్యారు. సభ నిర్వహణకు కోరం లేకపోవడంతో గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు అడివక్కపై 10 మంది సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగి పోయింది. కార్యక్రమంలో పీడీఓ దాదులూరప్ప, కార్యదర్శి ప్రఫుల్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి


సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పావగడ: పట్టణంలోని తాలూకా కార్యాలయంలో శనివారం లంబాడీల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ చంద్రశేఖర్, తదితరులు సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో స్థానిక లంబాడీ సంఘం నాయకులు, యువకులు పాల్గొన్నారు.

డ్రైవర్‌కు సన్మానం

పెనుకొండ: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో స్టేట్ లెవెల్లో యాక్సిడెంట్ ఫ్రీ అవార్డు పొందిన డ్రైవర్ అంజినాయక్, సేఫ్టీ ఇన్‌స్పెక్టర్‌గా అవార్డు స్వీకరించిన నాగరాజును ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు శనివారం సన్మానించారు. రోడ్డు భద్రతా మాసోత్సవంలో అంజినాయక్, నాగరాజు రాష్ట్ర స్థాయిలో పురస్కారం పొందడం గర్వకారణమని కమిటీ నాయకులు కొనియాడారు.

రొద్దం ఆస్పత్రి అభివృద్ధికి కృషి

రొద్దం: మండల కేంద్రంలోని 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి కృషి చేస్తానని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి అన్నారు. శనివారం బెల్ కంపెనీ ప్రతినిధులతో కలసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీ పరిశీలించారు. ఆస్పత్రికి కావాల్సిన పరికరాలు, అవసరాలు, సౌకర్యాలపై స్థానిక డాక్టర్ సోమశేఖర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీ మాట్లాడుతూ ఆస్పత్రిలో గర్భిణులకు శస్త్రచికిత్సలకు కావాల్సిన వసతులు ఏర్పాటు చేయడానికి చేయుతనివ్వాలని కంపెనీ ప్రతినిధులను కోరారు.

నేత్రపర్వం.. అడ్డ పల్లకీ ఉత్సవం



పావగడ: స్థానిక శనీశ్వరాలయంలో వెండి అడ్డ పల్లకీ ఉత్సవం నేత్రపర్వంగా సాగింది. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు వెండి తేరుపై కొలువుదీరిన జ్యేష్టాదేవి సమేత శనీశ్వరస్వామిని దర్శించుకున్నారు. మేళ తాళాలు, డోలు వాయిద్యాలు, మిరు మిట్లు గొలిపే విద్యుత్ దీపాల కాంతులతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220717, 9912220723, 9912220726